# నీవన్నది నిజం

శ్రీసుభా



నేను విజయవాడ వెళ్ళేసరికి చీకటిపడిపోయింది. విజయవాడ గురించి నేను భయపడాల్సింది లేకపోయినా, రాజమండ్రీ ట్రెయిన్ దాటిపోవడంతో కంగారుపుట్టింది. తెల్లవారేసరికి నన్ను చూడాలని గుమ్మంలోనే కాచుకు నుంచుంటుంది శారద.



రాకపోవడానికి కారణం అడక్కుండా అలగడం. అపోహపడ్డం. పది సంవత్సరాల నా చర్యల్ని, తన కన్నీటినీ కావ్యాలుగా అల్లి చూపడం శారద ప్రత్యేకత. లేకపోతే రమణమూర్తి అన్నట్టు స్త్రీలవేరొప్పే!

ఏంచెయ్యాలి, యెక్కడకు వెళ్ళాలని ప్రశ్నించుకునేసరికి-జవాబుగా ప్రసాదరావు మామయ్య గుర్తొచ్చాడు. ప్రసాదరావు మామయ్యను నేను పెద్దయ్యాక చూడనే లేదు. ఆయన చిన్నతనంలో మా యింట్లో వుండి చదువుకున్నాట్ట తల్లీ తండ్రిపోయి ప్రేమలేని బంధువుల యింట్లో తిట్లూ, దీవెనలతో పెరుగుతూ వుంటే, అంతవరకూ సంతానంలేని అమ్మ, పోనీ ఆసరాగా వుంటాడని తనతో తీసుకువచ్చిందిట. అంటే అప్పటికి మా అమ్మకు మేం యెవరం కలగలేదు. ప్రసాదరావు మా అమ్మను అక్కయ్యఅనీ, మా నాన్నగారిని బావ అనీ పిల్చేవాడు. మాకు జ్ఞానంకలిగే నాటికి, ప్రసాదరావు మామయ్య తన క్లాస్ మేట్ అరుంధతిని ప్రేమించి, పెళ్ళిచేసుకుని, మా యింట్లోంచి వెళ్ళిపోయాడు. చాలామంది ప్రేమించిన వాళ్ళని పెళ్ళి చేసుకోవడం కుదరకా, పెళ్ళాడినవారిని ప్రేమించే నేర్పూ వోర్పూలేక, వొకరకమయిన యాంత్రిక జీవితానికి అలవాటుపడిపోతున్న యీ అధునాతన యుగంలో ప్రేమించిన మనిషిని పెళ్ళాడిన ప్రసాదరావు గారంటే యీర్ష్య కలగడంలో అసహజంలేదు.

అయితే ప్రసాదరావుగారిని అంతగా అభిమానించి, పెంచిన అమ్మ ఆయన్ని దారుణంగా తిట్టిపోస్తూంటే — నాకు అమ్మ బాధకు కారణాలు వెదకాలనిపిస్తే—వచ్చిన జవాబు యిది.

అమ్మ ప్రసాదరావును యింటికితెచ్చిన నాలుగేళ్ళకి కామాక్షి అక్కయ్య పుట్టడం. పుట్టిన ఆ అమ్మాయిని ప్రసాదానికి యివ్వాలనే వూహని అక్కయ్యతోపాటు, మనసులో పెంచి పెద్దచేసుకోవడం జరిగిందిట. ప్రసాదరావు బి. ఏ. ప్యాస్ అయినరోజున అంతవరకూ దాచుకున్న వూహలు, పువ్వులుగా విచ్చుకుంటూంటే కూతురు భవిష్యత్తు పట్ల కన్న స్వప్నాలు—ఆ తల్లిలో చోటు లేనంతగా యెదిగిపోవడంతో, పెళ్ళిగురించి అతన్ని కదపడం. అతను నాల్గు రోజులు కదిలించినా, ప్రాధేయపడినా సారాంశం మొత్తానికి జవాబుగా అమ్మకు అతనినుంచి "కామాక్షి అంటే తనకు ఇష్టం లే"దనితప్ప మరో జవాబు అతనినుంచి అందుకోలేకపోయింది

పెంచి పోషించిన మొక్క ఆ విధంగా చేదుఫలాలు కాయడంతో అమ్మా, ప్రేమించిన అరుంధతికి చేతకానితనం వరంగా యివ్వలేక ప్రసాదరావూ, వొకళ్ళ కొకళ్ళు దూరమయిపోయారు.

ప్రసాదరావు వెళ్ళేరోజున అమ్మ తననే జయించిన అభిమానం ఆవేశంగా, ద్వేషంగా మారి నానా మాటలూ అని తిడితే, నవ్వుతూ వంగి అమ్మ కాళ్ళు పట్టుకోబోయిన తనకు ప్రతిఫలంగా నేలదక్కితే.... "అరుంధతిని ప్రేమిస్తున్నాను, నిజం. కానీయివాళ ఈరోజు మీ యింటినుంచి వెళ్ళిపోతున్నా. జీవితంలో నేను వెనక్కి తిరిగిన ప్రతిక్షణం మీరు కన్పిస్తారు .... మౌనంగా నేను నమస్కరించడం, మీరు కాదనడం జరగొచ్చు. మీరు రమ్మనకపోయినా వచ్చి, మీ తలుపు వెనుకనుంచి విడిచిన నిట్టూర్పులో భాషకందని ఆక్రందన - తలుపు తట్టలేని వ్రేళ్ళ మొనల స్పర్శా, నాదే అయ్యుంటుం"దని హెచ్చరించి వెళ్ళిపోయిన మామయ్య

గురించి, కథగా ఆయన జీవితం విన్న తరువాత క్షణంలో నాకు చూడాలనిపించిన ఆతృత - యిన్ని సంవత్సరాల అనంతరం నాకు మనోయవనికమీద కదలాడింది.

"మనకు సుఖం, సంతోషం లేకపోయినా యెదటివాళ్ళు ఆనందిస్తుంటే, ఆ ఆనందంలో నాకు భాగం వుందని అనగల్గిన వరం భగవంతుడు కొందరికే యిస్తాడు." నాకు భగవాన్ తక్కువ వరాలు యిచ్చాడని చీకటిరాత్రి బాధపడుతూంటే రమణమూర్తి పైమాట నాతో చెబుతూవుండేవాడు, మనకు దక్కింది అదేసుమా, అన్నట్టు నవ్వుతూ.

"మనం ఆశించినట్టు నలుగురూ సుఖపడుతుంటే చూడాలని ఆశపడ్డం - వాళ్ళు సుఖపడలేకపోతే మనదే ఆ కష్టం అయినట్టు యేక మథనపడిపోవడం కొందరిలో వీక్‌నెస్" అని నేనంటే కాదనీ వాడే అంటాడు.

నిన్న రాత్రి కామాక్షిఅక్కయ్య బావగారితో ఘర్షణ పడుతూంటే, మధ్యలో నేను మాట్లాడానని కాదు, తనని వెనకేసుకురాలేదని ఆమె "చేతకానివాడివినువ్వు" అంది.... కోపంలో అన్నమాట అని తను సరిపెట్టుకున్నాడు ..కానీ బావని చూస్తే చాలా బాధపడుతున్నట్టుగా కన్పించాడు. "చూడవోయ్ నేనేమన్నా అంతే యిదీ దీని వరస. ఇన్నేళ్ళ సంసారంలో అది నా వొక్క మాటైనా వినిందేమో చెప్పమను...."

"బావుంది....మీరు చెప్పినవన్నీ అంతే. మనకేం సంబంధం రాజుగారి కూతురు పెళ్ళికి వెళ్ళడం!" బావ చెప్పాడు. ఆ పెళ్ళికి వెళ్ళడం యెంత అవసరమో.... పైగా అక్కయ్యను తీసుకువచ్చి చూపించమని పెళ్ళి అయినప్పటినుంచి ఆయన పోరుతున్నట్టు.... "నేను ప్రతీచోటికీ వెళ్ళలేనురా....యెప్పుడో ఆయనగారు — యీయనకేదో చేస్తే, దానికి నాకూ సంబంధమేమిటి...."

అక్కయ్య లోపలకు వెళ్ళిపోయింది.

"ఇదీ మీ అక్కయ్య ధోరణి. యే రోజైనా కనీసం సన్నర్థం చేసుకుని ప్రవర్తిస్తుందేమో అనుకుంటాను. వుహూ. ఇంత డబ్బు గణిస్తున్నాను. ముగ్గురు పిల్లలు పుట్టారు. మా యిద్దరికీ మాత్రం ఘర్షణ జరగని రోజు లేదు .... నా భయమేమిటంటే కుర్రాళ్ళకుకూడా మా మనస్తత్వమే పట్టుబడుతుందేమోనని. అనుమానం కాదులే. ఇప్పటికే వొకళ్ళ నొకళ్ళు కొట్టుకుంటారు. పితూరీలు చెప్తారు. పిల్లలకోసమైనా మనం శాంతంగా ప్రవర్తించాలేమో...."

ప్రకాశం బావ అంతర్యంలో నాకు దాగిన రహస్యాలుగానీ, కుళ్ళుగానీ కన్పించలేదు. వొట్టి ఆవేదన తప్పించి. అక్కయ్యను మనసారా ప్రేమిస్తున్నాడనీ, ప్రాణంగా చూసుకుంటాడనీ మూడురోజులు వాళ్ళింట్లో వున్న నాకు రూఢీఅయింది. కానీ కామాక్షి అక్కయ్యకు - అంతగా ప్రేమించే భర్త పట్ల నిర్లిప్తతకు, ద్వేషానికి కారణం నాకు అంతు చిక్కలేదు. ఎంతో ఆలోచించాను. స్త్రీకి కావలసిన సరదాలు, నగలు, చీరలమీద మోజు; లంకంత యిల్లు - సామాన్య స్త్రీ కోరుకునేవన్నీ అందుబాటులో వున్నాయి అక్కయ్యకు మరీ లోటు లేకుండా చూసి - శాస్త్రయినా బెట్టు మిగుల్చుకోకుండా, ప్రేమించే మగవాణ్ణి స్త్రీ భరించలేదేమో అన్పించింది నాకు ఆఖరికి.

ఇన్ని ఆలోచనల బరువుతోవున్న నన్ను-ప్రసాదరావు మామయ్య యింటి ముందు రిక్షా ఆపి-దిగమన్నాడు రిక్షావాడు. తలుపులు మూసివున్నాయి. తీసివున్నట్టయితే సరాసరి లోపలకు వెళ్ళిపోయేవాణ్ణి.







ఏమని పిలవాలి?, ప్రసాదరావు మామయ్యకాక వేరెవరయినా తలుపుతెరిచి అడిగితే యేం చెప్పాలి. నన్ను నేను యెలా పరిచయం చేసుకోవాలి? ఇటువంటి అసందర్భపు ప్రశ్నలు లేచాయి. నిజానికి ప్రసాదరావు మామయ్య వచ్చినా తనని గుర్తుపట్టగలడా?

ఆయనకు చాలాభాగం తలనెరిసి.కళ్ళకింద నలుపు మొహంలో చీకటి వెలుతురుల ద్వైదీభావాల మిశ్రమంలా - పంచెమీద పొడుగుచేతుల కంచెమెడ లాల్చీవేసుకుని వుంటాడు-వృద్ధాప్యాన్ని ఆడ్డుకోలేని యవ్వనపు వోటమి మనిషి మొత్తంలో కన్పిస్తుందేమో.

దారితెలియని బాటసారి యోచనలా వూహలు ప్రయాణం చేస్తూంటే వో పదేళ్ళ అమ్మాయి తలుపుతెరిచింది.

"మీ నాన్నగారు వున్నారా యింట్లో" వెంటనే అడిగాడు తను.

"నాన్నంటే" అంది చప్పున ఆ చిన్నారి.

నాన్నంటే యెవరని చెప్పను? ఆ అమ్మాయి మొహంలోకిచూస్తే తండ్రి అనే వ్యక్తిని యెప్పుడూ చూడనట్టు-తనచుట్టూ యిన్నియేళ్ళ అనుభవంలో అటువంటి మనిషి చలించిన గుర్తులు తెలియనట్టుగా చూసింది.

నా గుండె అనుమానంతో - రక్తపు వేగంతో నన్ను భయపెట్టింది. ఈ అమ్మాయి... నెమ్మదిగా అన్నాను.

"అమ్మగారిని పిలుస్తావా?"

లోపలికి వెళ్ళిందిపాప.

పిదిగుమ్మం దాటి .వాకిలి లోపలకు అడుగుపెట్టాను చొరవగా. ముప్ఫైయేళ్ళు దాటిన స్త్రీ వాకిట్లోకి వచ్చింది. ఆవిడ నుదుట తోపు కుంకుమబొట్టు నాకు మానసిక విశ్రాంతి యిచ్చింది. భయం ఆవిరిగా హరించుకుపోయింది. తెలియని ఆత్రుత ఆరాటపడుతోంది అదేస్థానంలో.

చాకచక్యం తెలిసిన మధ్యతరగతి యింటి వాతావరణంలా వుంది ఆవిడ రూపం. ఉప్పాడ జరీచీర శరీరంమీద. బుద్ధిమంతుడు తలెత్తకుండా బిలపం పట్టుకుని పలకవైపు చూస్తోన్నంత నిశ్చలంగా అతుక్కుపోయింది.

ప్రసాదరావు మామయ్యచేత, కామాక్షీ అక్కయ్యనూ, పెంచిన అమ్మ ప్రేమను, ఆర్ద్రతను తనకోసం వ్యతిరేకింపజేయగల ఆకర్షణ, అందం పదేళ్ళనాడు తనస్వంతం చేసుకుని వుంటుందన్న ఆనవాళ్ళు లీలగా కదులాడి కన్పించసాగాయి ఆవిడలో.

"నేను ప్రసాదరావుగారికోసం వచ్చాను...."

"ఇంట్లో లేరు....మీరెవరు...."

నేను ఫలానా అని చెప్పాను....ఆవిడ గుర్తుగా కళ్ళు పైకెత్తి చూసింది. నేచెప్పింది అర్థమయినట్టుగా, మాటకన్నా ముందు నోరు చిన్నగా తెరిచింది.

"ఉహూ" అనుకుంది....తనలో....

---

● *"ఆహారానికి కోళ్ళంత ఉపయోగకరమైనవి మరి లేవు."*

*"ఎందుకనో?"*

*"వాటిని పుట్టకముందు, పుట్టినతరవాత కూడా తినవచ్చు.*

"మళ్ళీ వస్తానులెండి" అన్నాను.... విశ్శబ్దాన్ని భరించలేక....

"వచ్చే టైమయింది....అలాకూర్చోండి"

నెమ్మదిగా సోఫాలో కూలపడ్డాను.... ఆవిడ లోపలకు వెడుతూంటే - పాప "అత్తా" అ.టూ వెంటపడింది....

నాకు ఆ వాకిట్లో స్నేహితులుగా మనిషి లాంటి గడియారం. గుమ్మానికి తాజ్‌మహల్ అల్లికం అల్లిన తెర ...గోడలకు పటాలు మిగిలాయి. వొంటిగా కూర్చుని గడియారం చప్పుడు వినడం నాకు సరదా. ప్రతిక్షణం తను పడే కష్టాల్ని విప్పి చెప్పుకునే ఆప్త మిత్రుడి లాంటిది. మధ్యమధ్యలో నవ్వు తుంది అంతబాధలోనూ

ఇంతలో — లోపలినుంచి కాఫీ గ్లాసు తెస్తున్న పాప నన్ను చేరకుండానే దాన్ని కింద పడవెయ్యడం. నేను లేచి వెళ్ళే లోపున. అరుంధతిగారు లోపలినుంచి వచ్చి "పాడునా" అంటూ ఆ పిల్లదాన్ని లేవదీసి లోపలకు తీసుకువెళ్ళి కొట్టడం జరిగాయి. అవతలినుంచి దెబ్బలు. జవాబుగా ఆ అమ్మాయి యేడుపు. "వూరుకుంటావా. లేదా" అన్న ఆవిడ మాటలూ విన్పిస్తు న్నాయి.

"పోనీలెండి" అందామనుకున్నా....

బయటనుంచి యెవరో వచ్చిన అలికిడి విన్పించి వెనకు తిరిగాను. నేను వూహించిన ఆకారం ప్రాణం పోసుకున్నట్టుగా నలభై యేళ్ళ మనిషి. నా వూహలో లేని జరీ కండువా గోడ కొయ్యను తగిలిస్తూ ఆయన నావైపు చూశారు. అప్పటికే నేను లేచి నుంచున్నాను.

"పాపా" అని యేడుస్తున్న ఆ అమ్మా యిని పిల్చి "యెవరండీ మీరు?" అన్నాడు తిరిగి ఆయ). నేను చెప్పాను. మాటల కోసం తడుముకోవాల్సివచ్చింది. నాకు తెలియని కొత్త నాలో నాకు కన్పించింది.

ఆయనలో సంవత్సరాలనాడు నిద్ర పోయిన ఆనంద తరంగాలు లేచినట్టు. మొహంలో. మొత్తం ఇంద్రియాలు వుత్సాహ పడుతోన్నట్టు అన్పించింది. ఆ తాకిడికి తట్టుకుంటూనే ఆయన ...."అరుంధతీ చూశావా యెవరు వచ్చారో...." అని కేకేసి...."కూర్చోవోయ్ అంతాబావున్నారా. అక్కా బావా....ఎంతవాడివయ్యావు!"

నేను అన్నిటికీ బుర్ర వూపాను. ఆయనలో తన్మయత్వపు ఛాయలు నన్ను బంధిస్తున్నాయి. నాలో చాలా శక్తులు. నన్ను. చాలామందిని ఆకట్టుకోగలనేర్పు ఆయనలో వున్నట్టుగా అనిపించింది.

"నన్ను వసాది మామయ్యా అని పిలిచే వాడివి జ్ఞాపకం వుందా...."

ప్రసాదరావు మా కుటుంబాన్ని. మనుష్యుల్ని పేరు పేరునా అడుగుతూ భోజనం చేస్తున్నంతసేపూ తన్మయత్వం పొందుతూనే వున్నాడు. మధ్యలో అరుంధతిగారికి. గుర్తొచ్చే సంగతులూ. మేంచేసే అల్లరీ వివరించి కళ్ళముందు చిత్రిస్తూంటే నాకే ఆశ్చర్యం వేసింది....

కొందరు తెచ్చిపెట్టుకుని మాట్లాడుతారు. నవ్వితే యెదువు తెచ్చుకుని నవ్వినట్టుగానే వుంటుంది....ఇటువంటి మామయ్యా నేనా అమ్మ ఆపార్థం చేసుకున్నదీ!!

అన్నీ గుర్తొచాయి తిరిగి ...ఆలోచిస్తూంటే.

పదకొండు గంటలవరకూ నాతో కబుర్లు చెప్పి ప్రసాదరావుగారు లోపలకు వెళ్ళి పడుకున్నారు. వాకిట్లో వంటిగా పడుకున్నాను. కొత్తచోటేమో నిద్రపట్టలేదు.








కిటికీగుండా ఆకాశం మీద నైట్‌వాచ్‌మెన్ లా వున్న నిండు చంద్రుడు కన్పించాడు.

"నక్షత్రాలకు మాట్లాడ్డం నేర్పి మీకేం కావాలని అడిగితే ప్రతినక్షత్రం తనకో చందమామ కావాలంటుంది తెలుసా...." అన్న రమణమూర్తి మాటలు గుర్తొచ్చాయి .... వాడెప్పుడూ అంతే. ఏకాంతం, వియోగం తను భరించలేడు. ఎవరూ భరించకూడదంటాడు. వదును దేరితే మంచి రచయిత అవుతాడనుకుంటూ వుంటాను నేను.

మెలుకువలోంచి మగతలోకి. ఆపైన నిద్రలోకి నాకు తెలియకుండానే యే శక్తో తీసుకువెళ్ళి జారవిడిచింది. కలలోకూడా నాకు కావల్సిన విశ్రాంతి లభించలేదు. అమ్మ. నాన్నగారితో పోట్లాడుతోంది. పెద్దగా అరుస్తోంది. నాకు కోపం వచ్చి అరిచాను. లేచి వెళ్ళబోయాను అంతే....కల లోంచి జారి వాస్తవంలోకి కన్ను తెరిచేసరికి నిశ్శబ్దం వడిలో వుండవల్సిన నేను. వాకిలి వెనుక గదిలోంచి ప్రసాదరావు మామయ్య మాటలు. వాటిని సాంతం పూర్తికాకుండానే కటువుగా యెదుర్కొంటున్న అరుంధతిగారి వాగ్వివాద ధోరణి వినవల్సి వచ్చింది.

"వూరుకో...."

"అవును.... మీరు చేసే చాలా పనులు సహించి వూరుకున్నాను. ఈ పాపను నేను యిక పెంచలేను. దరిద్రగొట్టువిల్ల. ఇది యింటి కొచ్చినప్పటినుంచీ అన్నీ కష్టాలే...."

''మీ నాన్నగారు పోడానికీ. ఆ పసిదానికీ సంబంధమేమిటి...."

''మీకు లేకపోయినా నాకుంది. అయినా మీరెప్పుడూ యింతే. ప్రేమించి పెళ్ళి చేసుకుంటే — ఆ తరువాతకూడా మగవాడు తనని ప్రేమిస్తాడని ఆడది అనుకోడం

అవివేకం అని తెలిసింది. నామాట వొక్కటైనా చెల్లించనప్పుడు దేనికి? మీదారి మీది....''

''ఏమిటి చెల్లించేది. పెళ్ళిచేసుకున్న మొదలు మా పిన్ని అంటే. పడలేదు. నీ మూలంగా కదూ ఆవిడ మనింట్లోంచి వెళ్ళిపోయింది. మీ తమ్ముడికి చదువు చెప్తానని తీసుకువచ్చావు. వాడు చెడు తిరుగుళ్ళు తిరుగుతూవుంటే పాడయిపోతున్నాడని యింటికి పంపించేశాను. అది నాతప్పంటే నే నేంచెయ్యను....''

"నన్నేం నమ్మించ నక్ఖరలేదు. అసలు మీకు సీతారామయ్యగారి సంతానంమీద వున్న ప్రేమ, నామీద లేదు ..."

"ఏమిటి నువ్వు మాట్లాడేది...."

"నిజమే అంటున్నాను. మీరు వారం క్రితం చెప్పా పెట్టకుండా యెక్కడకు వెళ్ళిందీ, ఆరోజు తెలియకపోయినా యివాళ తెలిసింది. ఈ అబ్బాయి యెందుకువచ్చాడో నాకు తెలుసు; ఆ కామాక్షే కదూ మీ దగ్గరకు పంపింది;

"అరుంధతీ...."

"అంతగా అవిణ్ణే పెళ్ళాడాలనుకుంటే నే నేం కాదనేదాన్నా. యిన్నేళ్ళు వచ్చి.... ఛీ...."

''నోరు మూస్తావాలేదా. అతనికి వినబడితే యెంత బాధపడతాడో తెలుసా?"

"నా కేం భయంలేదు. మీ రీ వూరు నుంచి యెందుకు ట్రాన్స్ఫర్...."

ఆయన భరించలేక కొట్టినట్టున్నాడు. అవిడ యేడుస్తోంది. మాటలు స్పష్టత కోల్పోయి అర్ధరహితంగా వినబడుతున్నాయి.

నాకు లేచి పారిపోదామనిపించింది. నేను వెళ్ళిపోవడం అన్నది జరిగితే యెందుకు వెళ్ళిపోయిందీ ప్రసాదరావు మామయ్య వూహిస్తాడు.

మనలో రేగే అవమానపు ఛాయల్ని యెదటివాళ్ళు గుర్తుపట్టలేనప్పుడు కలిగే స్థైర్యం - ఆ నిజం నలుగురి నోటా పడ్డప్పుడు మరింత చిన్నతనంగా మారి దుఃఖితుల్ని చేస్తుంది.

కళ్ళు మూసుకొని నాకేం తెలియని అవస్థలో ఆలోచనల్లోని మనుష్యులందరికీ చోటివ్వడం చేతకాక కళ్ళు మూసుకొని పడుకున్నాను. అరుంధతిగారి యేడుపు చాలా సేపు జోలపాడుతూనేవుంది నాకు.

తెల్లవారింది. కాఫీ తాగడం అయిన తరువాత "నేవెడతాను మామయ్యా" అన్నాను రాత్రి జరిగిన సంఘటన నేను వినివుండనని ఆయన నమ్మాలనీ నా భావాల్ని, చర్యల్ని యెంతో అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించాను అది ఎంతవరకు నెరవేరిందో నాకు తెలియలేదు. ఆయన మాత్రం మరేమనకుండా కండువా వేసుకొని పద అన్నాడు. ఇంతలో గుమ్మం తెర వెనకనుంచి.

"భోజనానికి వస్తారా. ఎక్కడైనా భోజనం చేస్తారా?"

"కొంచెం పనుంది ... రాను...."

ప్లాట్ఫారంమీద యిద్దరం మౌనంగా నడుస్తున్నాం....అలంకారాలన్నీ తీసేసి పడుకుని, అప్పుడే లేచి బద్ధకంతో ఆవలిస్తున్న అందగత్తెలావుంది, పగటి పూట విజయవాడ రైల్వేస్టేషన్.

"నాన్నగారికి యేం చెప్పమంటారు?"

"నమస్కారాలు చెప్పు....ఆయన్ని చూడాలనివుంది...."

"అమ్మ యేం అనదు. పోనీ వొకసారి రాకూడదా. మామయ్యా'' అన్నాను.



"నీకు తెలియదోయ్. నే వచ్చానంటే వాళ్ళ మెదదేకాదు నామనసుకూడా పాడవుతుంది....'' అగి అన్నాడు.

"ఆరోజు అక్కయ్య మాట తేలిగ్గా కొట్టిపారవేసిన నేను, యీరోజు బ్రతుకులో సుఖపడ్డం లేదని, తొందరపాటుతో యిద్దరి హృదయాలూకూడా వెలితిపడ్డాయని అక్కకు తెలిస్తే మరింతకృంగిపోతుంది.... అక్కయ్యముందు నాబాధను యేనాడూ దాచుకున్నవాణ్ణి కాను. కానీ ఆవిడని బాధపెట్టడం యిష్టంలేక రావడం లేదంటే ... వొకవేళ వచ్చినా నాకు ఆత్మశాంతి దొరకొచ్చు... కానీ అక్కకు విశ్రాంతి కరువవుతుంది....అంతే....''

ఓదార్చగల్గిన హృదయం వున్నా, ప్రయత్నంమీద మాటలు కంఠంనుంచి తెచ్చుకోగల సమయమయినా, అందుకు తగిన వయస్సు లేనందున మౌనంగా వుండిపోయాను సుఖపడ్డానికీ దుఃఖించడానికీ అన్నిటికీ వయసుతో సంబంధ మున్నట్లే - వోదార్పు అందివ్వడానికి కూడా వో వయసు అవసరమని నాకా క్షణాన్నే తెలిసింది,

ఇంతలో రైలొచ్చింది. ''వుత్తరాలు వ్రాస్తూండు'' అని నన్ను రెలెక్కించి వెళ్ళిపోతున్న ప్రసాదరావు మామయ్య గుండె బరువుగా దిగులుపడ్డం నాకు కన్పించింది.

ఏ శాపం మూలంగా ప్రసాదరావు మామయ్య చవులూరిన బ్రతుకులో రుచిని

---

● పిచ్చాసుపత్రినిచూడ్డానికి ఒక పెద్దమనిషి వెళ్లాడు. ఒకచోట ఒకడు తన గుప్పిట్లోకి మాటిమాటికీ చూసుకుంటూ వూరికే మురిసిపోతున్నాడు.

"నీ చేతులో ఏముందేమిటి?" అడిగాడు పెద్దమనిషి.

"చెప్పుకోండి."

"సైకిలు"

"కాదు"

"కారు"

పిచ్చివాడు ఒకసారి గుప్పిలి కొద్దిగాతెరిచి చూసుకుని "ఉహు" అన్నాడు.

"రైలా?"

మళ్ళీచూసుకుని "కాదు."

"ఆ. తెలిసింది. గుర్రం!"

మళ్ళీ జాగ్రత్తగా గుప్పిలి చూసుకుని పిచ్చివాడు "తెల్లదా, నల్లదా?" అని అడిగాడు.

అందుకోలేకపోయాడో నాకర్థంకాలేదు. తన కోసం సర్వస్వాన్నీ త్యాగంచేసిన, చేస్తున్న భర్త అంటే, భార్యకున్న తృప్తి గౌరవం వుండవని అక్కయ్యలాగే అరుంధతిగారు కూడా నిరూపించుకుంది.

అయితే అరుంధతి వూహకు మూలలు లేవు. కేంద్ర బిందువులేదు. తనకు జరగని అన్యాయాన్ని వూహించుకుని — వాటినే పెద్దగా చిత్రించుకుంటోంది. అనే సంగతి ప్రసాదరావు మామయ్యతో పరిచయంవున్న యెవరైనా వప్పుకుంటారు.

అయితే అరుంధతి వేదనకు కారణం ? ప్రసాదరావు మామయ్య కళ్ళల్లో, మాటల వెనుక, బలమైనకోరిక, యేనాడో పోగొట్టుకున్నదానికి పశ్చాత్తాపం నాకు లీలగా కన్పించాయి. అమ్మమాటను కాదన్నదానికే బాధ పడుతున్నాడో, లేక అరుంధతి ప్రవర్తనతో విసిగి, కామాక్షిఅక్కయ్య తలపుల్లో జీవిస్తున్నాడో భేదించగలిగితేగాని తెలియదు.

ఈ విధంగా చెయ్యగలిగితే బావుంటుందని ప్రతిమనిషీ, వాస్తవంలో చీకటి యెదురయినప్పుడు అనుకుంటాడు. అదో తృప్తి. ఆ తృప్తిలోనయినా యీ భయంకర వాతావరణంనుంచి దూరంగా వెళ్ళి కలల లహరిలో వూగిసలాడతాడు....

అయితే - అయితే....నాకు తెలియకుండానే కామాక్షి అక్కయ్యమీదకూడా జాలి పుట్టుకొచ్చింది ప్రేమించిన మనిషి తనకు కాకుండాపోతే, కాదు, తననికాదని తిరస్కరించిపోతే, ఆ మనిషిలో కలల యెత్తుపల్లాలు తల్లక్రిందులయితే....యిలాగే ప్రవర్తన ప్రతిధ్వనిస్తూ వుంటుందా ? ఆ మనుష్యుల్ని మనం యేదృష్టితో కొలవాలి ? వాళ్ళకు మన హృదయాల్లో యివ్వగల్గిన స్థానం యెంతటిది ? ఈప్రశ్నకు నాకు సరియైన జవాబు దొరకలేదు. ఆలోచనలకు ప్రతిగా అర్థంకాని ఆవేదన, వరంగా నన్ను ప్రయాణం పొడుగునా వేధించింది.

నేను యింటికి వెళ్ళేసరికి అమ్మ-తమ్ముడిచేత వుత్తరం వ్రాయిస్తోంది. వాడు నన్నుచూసి

"అమ్మా-అన్నయ్యవచ్చాడే" అన్నాడు.

"మొన్న నే, వస్తానన్నావు, ఇంత ఆలస్యంచేశావేం? అక్కయ్య యెలావుంది" అంది అమ్మ.

"బాగానేవుంది."

అమ్మ తిరిగి తనపనిలో మునిగిపోయింది. అమ్మకు ప్రసాదరావు మామయ్యగురించి చెప్పాలా వద్దా అని క్షణం తటపటాయించాను. నా ఆలోచనలకు, అనుమానాలకు సరియైన జవాబు అమ్మదగ్గర దొరుకుతుందనిపించింది.

"అమ్మా" అంటూ మొదలుపెట్టి ఆవిడ వైపు చూస్తూ అంతాచెప్పాను. అమ్మ అంతర్యంలో యెటువంటి తరంగాలు కదులాడతాయో వెదుకుతూ

"నీ గురించి, నిన్ను చూడాలని అనుకుంటున్నాడు" అన్నాను చివరికి.

"ఎందుకు, చేసింది చాల్లేదా. వాడి మొహం ఈ జన్మలో నేను చూడదల్చుకోలేదు. బాగాజరిగింది శాస్తి" అనేసి అపైన స్వగతంగా గొణుక్కుంటోంది.

"అమ్మా."

"నువ్వు నోరుమూసు కూరుకో వారేయ్. అసలు వాడింటికి నువ్వెందుకు వెళ్లావు."

నాకు ఆశాభంగమే జరిగింది. అమ్మలోపల యీ నాటికీ కన్పించని ద్వేషం రాజుకుంటూ వుందన్నమాట. ఈ రోజైనా అది కరిగి కరుణగా మారకూడదా. నిరాశగా లోపలి గదిలోకి వెళ్ళాను.

గది విడిచి వెళ్ళిపోతున్న వూగుతున్న జడ, తలలో పువ్వుల భాగం, జరీ అంచు ఉన్న పమిటచెంగు, అన్నీ గడపదాటి మాయమవుతున్నాయి. శారదతో జరిగిందంతా చెప్పాలి.

"యేవోయ్ మాట" అన్నాను.

చాలా ఆలస్యంగా విసుగ్గా, నెమ్మదిగా వచ్చింది. నా మెదడులో భయం పరుగు తీసింది.

"వంట్లో బాగోలేదా ?"

"వుంది...."

"మరి అలా వున్నావేం ?"

"ఎలా వుండాలి ?"

"నే వుండమన్నట్టు వుంటావని నాకు తెలుసుగానీ, మొదట అలా కూర్చుని నే చెప్పేది విను....విన్నరాత్రేమోనేం...." శారద చటుక్కున అంది:

"మీరేం చెప్పనక్కర్లేదు, నాకు తెలుసు...." అంది. ఆమాట వెనుక వర్షించబోయే మేఘం, పట్టుకునే కటుత్వం తెలియని చిరాకు, అన్నీ వున్నాయి.

"ఏం తెలుసు" అన్నాను నెమ్మదిగా....

"తిరిగి నే చెప్పాలేమిటి ? ..."

వెళిపోతున్న మనిషిని అంటుకోవాలనుకుంటే మెత్తని జడలో చివరిపాయలు అందినట్టే అందితే - అయిష్టంగా శారద నావైపు తిరిగిందనిపించింది.

"వదలండి"

దేనికైనా కారణం వుండాలిగా. పైగా చిన్న కారణాలని సిల్లీగా తీసుకుని...."

"రాజలక్ష్మి మిమ్మల్ని విజయవాడలో ఆపేసింది....అతిదిగా రెండురోజులు వుండమంది....పాపం మీరు కాదనలేకపోయారు" ఆగి అంది...." వీటికి నగిషీలు చెక్కేగా మీరు చెప్పేది"

"ఛాఛా, అదేంలేదు. ఆ అమ్మాయి మన రమణమూర్తి భార్య కాబోతోంది తెలుసా ?"

"నన్ను వదలండి చాలు"

"అసలింతకీ నేను ..."

"మిమ్మల్ని నమ్మకూడదు....యిన్ని చెప్పి...."

నా ఆవేశం, శరీరంలో భూతంలా యెదిగిపోతూంటే - వెళ్ళి గట్టిగా భుజాలు పట్టుకుని అన్నాను.

"అసలు, మిమ్మల్ని, ఆడవాళ్ళని నమ్మకూడదు. మీకు ప్రేమించడం చేతకాదు, ప్రేమించబడ్డం తప్పించి."

శారద నా చేతుల్లోంచి తప్పించుకుంది. నాచేతిమీద రెండు కన్నీటి బిందువులు మాత్రం వున్నాయి.

---

● ఇంటియజమాని : "ఏమండీ, మూడునెల్ల అద్దె బకాయి పడ్డారు. ఎప్పుడిద్దామని ?"

యువరచయిత: "ఇచ్చేస్తాసార్! మంచి ప్లాటొకటి ఆలోచిస్తున్నాను. అదేదన్నా కుదిరి, నేను రాయదలచిన నవలరాసి, నవలల పోటీకి పంపించి వాళ్ళు బహుమతి ఇచ్చి, చెక్కు పంపించగానే, బ్యాంకికెళ్ళి మార్చి మార్చి డబ్బు తీసుకోగానే, మీ బాకీ పూర్తిగా చెల్లించేస్తాం."



వారంరోజులుగా మనుష్యులచుట్టూ పరిభ్రమించి చాలా మనసుల్ని పసిగట్టగల్గీ, వాళ్ళ వ్యథలకు మొదలు తెలుసుకోలేక పోయాననిపించింది.

ఎక్కడా అభిమానంలేదు. ఉన్న అభిమానం చుట్టూ ద్వేషం పూత. మీటితే బ్రద్దలయి సర్వనాశనం చేసేశక్తుల అశాంతి — పల్చటి పొరలతో శాంతిని కాపాడుతోంది. నవ్వు వెనుక శబ్దంలో తీరనితనం. మనిషి లోపల కన్పించకుండా జీవిస్తున్న రాక్షసుల హాహాకారాలు.

నాల్గురోజులు అలాగే గడిచాయి. నా సంశయాలు, భయాలు, బయటకు వెళ్ళి స్వేచ్ఛగా జీవించే శక్తిలేని ప్రాణుల్లా నాలోనేవుండి వేధిస్తూ, వోదారుస్తూ రకరకాల అనుభూతుల్ని కల్గిస్తున్నాయి. ఇటు వాస్తవంలో అటు కలలో.

మరునాడు బుచ్చిబాబుగారి "కసత్వం" చదువుతూంటే, ఆయన ఉదహరించిన "లారాషిఫోకాడ్"అనే ఫ్రెంచిసాహితీవేత్త మాటలు "మరీ యెక్కువగా ప్రేమించేవాళ్ళపట్లకంటే, ద్వేషించేవారిపట్లే యిష్టం యేర్పడుతుంది" నన్ను ఆకర్షించాయి. నా మెదడుపై తాకిడితెచ్చాయి. నన్నుకుదిపి క్రిందా మీదా పడేశాయి.

తికమకపెట్టే లెక్కచేస్తున్న విద్యార్థి మెదడు వో విధమైన చిరాకుతో వుంటుంది. ఆ చిరాకు భరించలేక చటుక్కున ఆఖరి పేజీలో ఆన్సర్ చూస్తే లెక్కమీద 'యింతేనా' అనే తేలిక అభిప్రాయంతోపాటు, తను చేసినవిధానంలో తప్పుకూడా ముల్లులా గుచ్చుతోనే వుంటుంది అమ్మ మాటను కాదని, ఆమెకు దూరంగా జరిగి, తనని ద్వేషిస్తోందని తెలిసీకూడా, అమ్మ పట్ల గౌరవభావం చంపుకోలేని ప్రసాదరావు మామయ్య అంతర్యం నిజరూపం దొరికింది. తమకోసం ఆస్తుల్నీ, పెంచినవాళ్ళనీ వొదులుకుని తామే సర్వస్వం అని నమ్మిన భర్తల్నీ, అనుమానంపేర దూరంచేసుకుంటూ, ద్వేషాగ్నితో కాల్చుకుంటూన్న అరుంధతి, కామాక్షి అక్కయ్యలరూపం వెనుకదాగిన అర్థంకాని, విధి విధిపినకన్నీటి బొట్లూ కన్పించాయి.

ఊరునుంచి వచ్చినరోజు శారద నన్ను అనుమానించడంలో, ఆమెకే కన్పించని లోతులు వున్నాయని తెలిసి నా ప్రేమకు గర్వపడాలో, ఆమెలో మొదలయ్యే ద్వేషానికి మంగళహారతి పాడాలో తెలియలేదు. ఎన్నో యిబ్బందుల్నీ, చుట్టూ మనుష్యుల నుంచి ఈర్ష్యాసూయలను భరించిగానీ 'లారాషిఫోకాడ్' ఆ మాట అనివుండడు. చుట్టూ మనుష్యుల్లో చెలరేగే మానసిక సంక్షోభాన్ని తట్టుకోలేక, నిభాయించుకోలేక కన్నీటిని దాచుకుని ఆమాట రాసివుంటాడు.

ఆయనకు మనసులో మౌనంగా నమస్కరిస్తూ, మెదడులోవెలిగే శాంతిని శారదకు చూపించడంకోసం లోపలికి పరిగెత్తాను. □□□

